క్లుప్తంగా

లీజుకు ఆర్టీసీ స్థలం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో వెనుక భాగంలో ఉన్న 13262 చదరపు గజాలు, సుమారు 2 ఎకరాల స్థలాన్ని లీజుకు ఇస్తామని డిపో మేనేజర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో వెనుక ఉన్న నరవ కొమరోలు రోడ్డు ముఖం స్థలాన్ని ఆసక్తి ఉన్న వారికి 15 ఏళ్ల పాటు లీజుకు ఇస్తామని చెప్పారు. నెల్లూరులో ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు వేయవచ్చని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం డిపో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

యర్రగొండపాలెం: స్థానిక గిరిజన చెంచు గురుకుల పాఠశాల ఆవరణలో ఈ నెల 16వ తేదీన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ కమిటీ కన్వీనర్ మారుబోయిన వెంకటరెడ్డి గురువారం తెలిపారు. పోటీలను అండర్-14, అండర్-16 బాల,బాలికలకు నిర్వహిస్తున్నామని, ఎంపికైన క్రీడాకారులు 2024 జనవరిలో గుజరాత్‌లో జరిగే జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 76750 26220, 82473 18995 నంబర్లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

17న నేత్ర వైద్య పరీక్షలు

దర్శి: పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. దర్శి యూనిట్ పరిధిలోని కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి మండలాల్లోని సభ్యులందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వైద్యశిబిరానికి నరసరావుపేటకు చెందిన మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రి యజమాని డాక్టర్ రామలింగారెడ్డి హాజరై పెన్షనర్లకు నేత్ర పరీక్షలు చేస్తారని ఆయన తెలిపారు. ప్రతి సభ్యుడు తప్పక తమ ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, హెల్త్ కార్డు వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

పెద్దారవీడు: పాఠశాలల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ 1,2 పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచే శానిటేషన్ వస్తువులను ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం వారు అందజేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ మరుగుదొడ్లను శానిటేషన్ ద్వారా ప్రతి రోజూ శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మండలంలో మొత్తం 60 జెడ్పీహెచ్, యూపీ, ఎంపీపీ పాఠశాలలకు శానిటేషన్ వస్తువులు పంపిణీ చేశారు. ఎంఐఎస్ మండల కోఆర్డినేటర్ వి.ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు జి.చంద్రశేఖర్, గోసు సుబ్బారావు, శ్రీనివాసులు, హెచ్ఎం వెంకటరావు, గొట్టం సూర్యనారాయణరెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

బేస్తవారిపేట: మండలంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.పార్వతి తెలిపారు. ఈ నెల 15న బేస్తవారిపేట, నేకునాంబాద్, 16న పెద్ద ఓబినేనిపల్లె, చిన్న ఓబినేనిపల్లె, 17న సలకలవీడు, చెట్టిచర్ల, 18న పందిళ్లపల్లె, మోక్షగుండం, 19న పూసలపాడు, జేసీపీ అగ్రహారం, 20న పిటికాయగుళ్ల, ఖాజీపురం, 21న ఎంపీ చెరువు, బసినేపల్లె, 22న అక్కపల్లె, పీవీ పురం, 23న గలిజేరుగుళ్ల, కోనపల్లె పంచాయతీల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఆధార్ నమోదు..

వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగే పంచాయతీల్లో ఆధార్ నమోదు క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. 5-15 ఏళ్లలోపు వారికి ఆధార్‌కార్డు మంజూరు, ఆధార్ కార్డుల్లో చిరునామా, ఫొటో మార్పు, ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింకు, వేలిముద్రలు అప్‌డేట్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు బస్ షెల్టర్ ప్రారంభం



ముండ్లమూరులో నూతనంగా నిర్మించిన చేసిన బస్ షెల్టర్

ముండ్లమూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభించనున్నట్లు ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు పులికొండ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్శి-అద్దంకి ప్రధాన రహదారిలో ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎండకి, వానకి ఇబ్బందులు పడుతుండటంతో వారి కష్టాలను గుర్తించి బస్ షెల్టర్ నిర్మించినట్లు పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బస్ షెల్టర్‌ను నిర్మించగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి శిద్దా రాఘవరావు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ వస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఆర్యవైశ్య సంఘ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గ్రామీణులకు వైద్య శిబిరాలతో మేలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దొనకొండ: గ్రామీణ ప్రాంత జలు చాలామంది వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్నారని, ఈ ప్రాంతంలో అలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించటం ఎంతో మేలని దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో గురువారం కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు సౌజన్యంతో ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శివప్రసాదరెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము దొనకొండ ప్రాంతానికి 2004 నుంచి తమ తండ్రి దివంగత బూచేపల్లి సుబ్బారెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. స్థానిక రైల్వే వైద్యులు ప్రకాష్, కిమ్స్ వైద్యులు అశోక్, ఉదయ్, కార్తీక్, మార్కాపురం ఎల్‌వీ కంటి వైద్యశాల నిపుణులు, దంత వైద్య నిపుణులు 331 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, మాజీ ఎంపీపీ ఆదిమూలపు విజయ నిర్మల, మాజీ సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ గఫార్, ఉప సర్పంచ్ పి.ఇమ్రాన్‌ఖాన్, మల్లెల ఆనంద్‌బాబు, కె.ఐజక్ డయన్, ఐలూరి శ్రీనివాసరెడ్డి, రహమత్ బేగ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి, పక్కన ఎంపీడీఓ

తర్లుపాడు: మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికాబద్ధంగా ప్రగతిని సాధిస్తున్నట్లు ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. కోట్ల రూపాయలను వెచ్చించి గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, మిల్క్ సెంటర్లు, హెల్త్ క్లినిక్‌లు నిర్మించిందని వివరించారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసే పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ప్రజాప్రతినిధుల ఫిర్యాదులపై అధికారులు వేగంగా స్పందించాలని ఎంపీపీ సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ వెన్నా ఇందిరా హనుమారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ నిధులతో మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యలపై అధికారులు వేగంగా స్పందించాలని చెప్పారు. ముందుగా అజెండాలోని అంశాలను అధికారులు చదివి వినిపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని పోతలపాడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. పంచాయతీలకు అదనపు నిధులు కేటాయించాలని సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు పెద్ద మస్తాన్ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.నరసింహులు, సింగిల్ విండో చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌అలీ, ఏఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ డి.సుజాత, విద్యుత్ ఏఈ హనుమానాయక్, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ నాగరాజు, పశు వైద్యాధికారి నందన, హౌసింగ్ ఏఈ నిర్మల్‌బాబు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ మేట్లకు శిక్షణ

కంభం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్‌బాబు అధ్యక్షతన మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం మేట్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కొలతలను సక్రమంగా చూసుకోవాలన్నారు. గ్రూపులో ఉన్న సభ్యులు ఒక రోజుకు రూ.272 వచ్చే విధంగా పనిచేయించే విధంగా మార్క్ ఔట్ ఇచ్చేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఏపీఓ ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఏపీడీ భాస్కర్, జంగంగుంట్ల, రావిపాడు, కంభం గ్రామ పంచాయతీల్లోని మేట్లు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న బూచేపల్లి

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 172 మంది పదో తరగతి విద్యార్థులకు గురువారం దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆల్ ఇన్ ఒన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. తాము నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఏటా ఉచితంగా బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి ట్రస్ట్ ద్వారా స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుకుని 10వ తరగతి మొదటి మెట్టు అని, మంచి మార్కులు తెచ్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు మాట్లాడుతూ పిల్లలు డయాస్ ముందు కూర్చోవడానికి ఇబ్బందికరంగా ఉందని, ఫ్లోరింగ్ వేయించాలని, అలాగే మధ్యాహ్న భోజనం తినడానికి డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని శివప్రసాదరెడ్డిని కోరారు. ఆయన స్పందించి డైనింగ్ హాల్ జెడ్పీ గ్రాంట్‌తో ఏర్పాటు చేస్తామని, ఫ్లోరింగ్ మాత్రం తమ సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, మాజీ సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి, ఎంపీటీసీలు గుంటు అమ్మాజీ అజయ్, తాల్లూరి లక్ష్మీ నగేష్, ఐలూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌ను కలిసిన మర్రిపూడి ఎంపీపీ



మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ వాకా

మార్కాపురం: రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను గురువారం మార్కాపురంలోని క్యాంప్ కార్యాలయంలో మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, జెడ్పీటీసీ వెంకట్రావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నాగయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు. గురువారం రాత్రి మంత్రి సురేష్‌ను కొండపి పంచాయతీరాజ్ డీఈ రవికుమార్, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూడాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు సకాలంలో అందేలా చూడాలని ఎంపీడీఓ యుగకీర్తి అన్నారు. మండలంలోని బెల్లంకొండవారిపాలెం, లక్కవరం గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ పోశం సుమలతా శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ గూడా సరస్వతీ ప్రభాకర రెడ్డి, ఎంఈఓ సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



గుర్రాలమడుగులో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ

కొనకనమిట్ల: రబీ సీజన్‌లో మండలంలో సాగు చేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ గుర్రాలమడుగులో ఈ పంట నమోదును ఆమె పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. పంటలు సాగు చేసిన రైతులు ఆర్బీకేల్లో వీఏఏలను సంప్రదించి ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి
- పార్టీలో 120 మంది యువత చేరిక



పార్టీలో చేరిన యువతతో కృష్ణమోహన్‌రెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని 11వ బ్లాక్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, కొత్త ఓటర్లు 120 మంది కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మార్కాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. మార్కాపురంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు, పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.

పార్టీలో చేరిన వారిలో టి.వెంకటేశ్వర్లు, గంగయ్య, మీరావలి, నాగార్జున, నాగేశ్వరరావు, నగేష్, ఉపేంద్ర, బాబు, గురవయ్య, రఫీ, రసూల్, నారాయణ, శాంతి, అజయ్, శివ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవకరు ఐమ్మ, సిరాజ్, కొత్త కృష్ణా, కరిముల్లా, ఏలూరు జ్యోతి, వార్డు ఇన్‌ఛార్జి ఉత్తమ్, బుదాల సతీష్, రసూల్, సురేష్, జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: స్థానిక పుట్టబజారుకు చెందిన షేక్ మస్తాన్ బీకి ఆరోగ్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.80 వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును శాసనసభ్యుడు మద్దిశెట్టి వేణుగోపాల్ ఆమె కుటుంబ సభ్యులకు గురువారం తన కార్యాలయంలో అందజేశారు. ఆ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వీసీరెడ్డి ఉన్నారు.

అమ్మవారి గుడికి రూ.25 వేల ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

దర్శి: మండలంలోని వేంకటాచలంపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ నీలంపాటి లక్ష్మి అమ్మవారి ఆలయానికి దర్శి శాసనసభ్యుడు మద్దిశెట్టి వేణుగోపాల్ రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను గురువారం ఆయన నివాసంలో కలిసి ఆలయానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. అందుకు స్పందించిన ఆయన నగదును నిర్వాహకులకు అందజేశారు.

గిరిజనుల అభ్యున్నతికి పాటుపడింది జగనే



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి, తదితరులు

పుల్లలచెరువు: రాష్ట్రంలోని గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి అన్నారు. టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కనిగిరి నుంచి వచ్చి యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను విమర్శిస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గురువారం పుల్లలచెరువులో జరిగిన సమావేశంలో మండలపార్టీ నాయకులు మాట్లాడుతూ బుధవారం గారపెంట గిరిజన గూడెంలో వైఎస్సార్ సీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకున్నారని, కానీ వారంతా గతంలో టీడీపీలో ఉన్నవారేనని, కొత్తగా పార్టీలో చేరినట్లు ప్రజలను నమ్మిస్తున్నారని, గత ఎన్నికల్లో ప్రజలు ఛీ కొట్టినా ఆ పార్టీ నాయకులు ప్రజలను మోసగించడం మానుకోలేదన్నారు. త్వరలో జరగే ఎన్నికల్లో కూడా టీడీపీకి ప్రజలు బుద్ధి చెబుతారని, మళ్లీ ఎరిక్షన్‌బాబు కనిగిరి వెళ్లక తప్పదన్నారు. మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమేనన్నారు. ఎంపీపీ కందుల వెంకటయ్య, సచివాలయ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, నాయకులు పంది నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



సంక్షేమ లబ్ధి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చైర్మన్ ఇస్మాయిల్, నాయకులు

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రజలకు మరోసారి మంచి చేసేందుకు జగనన్నను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలోని 15 వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైఎస్ చైర్మన్ మాట్లాడుతూ.. సచివాలయం పరిధిలో 5727 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా 44.98 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందని వివరించారు. వార్డులో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజాభిప్రాయం స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్2 అంజమ్మ శ్రీనివాసులు, డీఈ సుబాని, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్ర, నాయకులు షెక్షావలి, ఉస్మాన్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శంకరరావు బాధ్యతల స్వీకరణ



శంకరరావు

ముండ్లమూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.శంకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఎంపీడీఓ హనుమంతరావు దర్శికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కురిచేడులో ఎంపీడీఓగా పని చేస్తున్న శంకరరావు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సకాలంలో అందించి వారి అభివృద్ధికి దోహదపడతానన్నారు. గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ ఉద్యోగుల సమ్మె



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు, నాయకులు

మార్కాపురం: తమ డిమాండ్‌ల సాధన కోసం పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మూడో రోజు గురువారం కొనసాగింది. స్థానిక కోర్టు సెంటర్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం నుంచి కంభం సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు మీరావలి, నారాయణరెడ్డి మాట్లాడుతూ.. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. సమ్మెకు సీపీఐ నాయకులు అందె నాసరయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి సోమయ్య, డీకెఎం రఫీ, ఎస్కే కాశిం తదితరులు మద్దతు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న అధికారులు

కొనకనమిట్ల: లోకరక్షకుడు ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని తహసీల్దార్ షాజిదా, ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, ఎంఈఓ నరసింహరావు, పాస్టర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం, డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీఎం కర్నాటి గోపాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు విజయభాస్కర్, ఆనందరావు, జాన్ దైవ సందేశం అందించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కేపీ ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చిరుగూరి కోటేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, సీసీలు వేల్పుల యజ్రా, రాజయ్య, రామయ్య, సురభయ్య, వివోఏలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి సంధ్య

కురిచేడు: తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలను కాపాడేందుకు రైతులకు వ్యవసాయ, హార్టికల్చర్ సిబ్బంది అందుబాటులో ఉండి సహకరించాలని ఉద్యానవన అధికారి సంధ్య సూచించారు. మండలంలోని పొట్లపాడు, పేరంబొట్లపాలెం, అగ్రహారం, పడమర వీరాయపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప పంటను కాపాడుకునేందుకు రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సిబ్బంది ప్రతి రైతును కలిసి వారికి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. ఆమె వెంట ఉద్యాన విస్తరణాధికారి ధనలక్ష్మి, అగ్రికల్చర్ సహాయకురాలు హారిక, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సరుకుల పంపిణీ



లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్



అంగన్‌వాడీ కేంద్రం తాళం తెరిపిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ సెంటర్లను మూత వేసి ధర్నా చేస్తున్న సందర్భంగా లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ డి.సీతారామయ్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తెరిచి అందులోని సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి లబ్ధిపొందుతున్న గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహారం నిలిచిపోకుండా సచివాలయం సిబ్బందితో పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలు స్వాధీనం

తర్లుపాడు: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె నిర్వహిస్తుండటంతో మూతపడిన కేంద్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సేవలు కొనసాగించాలనే ఉద్దేశంతో తాళాలు తెరిపించి, వీఆర్వో సమక్షంలో పంచనామా అనంతరం మహిళ పోలీసుల ద్వారా సేవలు కొనసాగించారు. పౌష్టికాహారం పంపిణీ చేయకపోతే లబ్ధిదారులు ఇబ్బంది పడతారనే కారణంతో కేంద్రాలను తెరిపించినట్లు ఎంపీడీఓ నరసింహులు, సూపర్‌వైజర్ కృష్ణవేణి తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు

కంభం: మండలంలోని తురిమెళ్ల గ్రామ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించిన సంఘటన గురువారం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు చెంది విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలను అదుపు చేసి మంటలు ఎలా వ్యాపించాయనే విషయంపై ఆరాతీశారు.